సేవలు నిల్.. కష్టాలు ఫుల్

- ఆర్‌బీకేల్లో నిరుపయోగంగా కియోస్క్ యంత్రాలు
- రైతులకు సకాలంలో అందని సేవలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

ప్రత్తిపాడు రూరల్: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేసింది. రైతులకు మేలు చేకూర్చేవిధంగా వ్యవసాయ రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. దీనిలో భాగంగా రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులకు అన్నిరకాల సేవలు అందుబాటులోకి వచ్చారు. ఆర్‌బీకేల్లో కియోస్క్ యంత్రాలు ఏర్పాటు చేసి ఆన్‌లైన్ ద్వారా నమోదు చేస్తే అవసరమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు, విత్తనాలు రాయితీతో అందించేవారు. ప్రస్తుతం కియోస్క్ యంత్రాలు నిరుపయోగంగా మారడంతో వ్యవసాయ సీజన్‌లో రైతులకు సకాలంలో అవసరమైన ఎరువులు అందడం లేదు.

నియోజకవర్గంలో 84 కియోస్క్ యంత్రాలు

ప్రత్తిపాడు నియోజకవర్గంలో రైతు సేవా కేంద్రాల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 84 కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేసింది. రైతు అభివృద్ధే–రాష్ట్ర అభివృద్ధి అనే నినాదంలో రైతు భరోసా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందేవి. విత్తనాలు, ఎరువుల కొనుగోలు కోసం రైతులు ముందస్తుగా నమోదు చేసి వాటికి నగదు చెల్లించేవారు. ఫలితంగా మధ్యవర్తి ప్రమేయం లేకుండా రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందేవి. రైతుసేవా మిత్రల హాజరు, వాతావరణ సమాచారం, పంటల సాగుకు సంబంధించిన పూర్తిన సమాచారం రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్నదాతలకు తెలియజేసేవారు. రైతులు ఏ పంట వేయాలన్నా సమగ్ర సమాచారం ఇందులో పొందుపర్చి ఉండేది. కాగా ప్రస్తుతం ఆ యంత్రాలు నిరుపయోగంగా మారాయి.

పేరు మారింది.. సేవలు నిలిచాయి

ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. ఇవి పేరుకే రైతు సేవా కేంద్రాలు తప్ప వాటి ద్వారా తమకు ఎటువంటి సేవలు అందడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం సాంకేతిక లోపంతో కియోస్కా యంత్రాలు పని చేయడం లేదు. కొన్నిచోట్ల పూర్తిగా వాటిని విస్మరించడంతో మూలకు పెట్టేశారు. వచ్చే సీజన్‌లోనైనా వాటిని వాడకంలోకి తీసుకువచ్చి తమకు మెరుగైన సేవలు అందించాలని రైతులు కోరుతున్నారు.

సేవలు పునరుద్ధరించాలి



రైతులకు పూర్తిస్థాయిలో రైతు సేవా కేంద్రాల ద్వారా వ్యవసాయ సేవలు పునరుద్ధరించాలి. వ్యవసాయ యాప్‌లపై అవగాహన కల్పించి, సాగులో దిగుబడులు పెంచడానికి కృషి చేయాలి. కియోస్క్ మెషీన్లను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడంతో పాటు సకాలంలో రైతులకు విత్తనాలు, ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలి.
– గొల్లపల్లి దొరబాబు, రైతు, ఉత్తరకంచి,, ప్రత్తిపాడు మండలం

మెరుగైన సేవలు అందించేందుకు కృషి



కియోస్క్ ద్వారా పూర్తి సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. ప్రస్తుతం రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎరువులు, విత్తనాలు వ్యవసాయ సిబ్బంది అందజేస్తున్నారు. రైతుల సౌలభ్యం కోసం సెల్ ఫోన్ యాప్ ద్వారా సేవలు అందిస్తున్నాం. కియోస్క్ ద్వారా మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. – వై గంగాధర్, మండల వ్యవసాయ అధికారి, ప్రత్తిపాడు


ధర్మవరంలో రైతు సేవా కేంద్రంలో నిరుపయోగంగా ఉన్న కియోస్క్ యంత్రం

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి చేయూత


గజ్జనపూడిలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: ఆపదలో ఉన్న బాధిత కుటుంబాలకు ఆపన్న హస్తం అందించడమే లక్ష్యంగా తాను ఎంఎంఆర్ ఛారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు తెలిపారు. మండలంలోని గజ్జనపూడిలో ఇటీవల మృతి చెందిన చంద్రాడ ఇజ్రాయెల్ కుటుంబాన్ని శనివారం ఆయన పరామర్శించారు. ఇజ్రాయేల్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొనగాల అప్పలరాజు, ఎంపీటీసీ మొల్లి వీరబాబు, మాజీ ఎంపీటీసీ అల్లి సత్తిబాబు, సాలివాహన కార్పొరేషన్ జిల్లా సభ్యుడు అనకాపల్లి నూకరాజు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా గ్రావెల్ తరలిస్తే చర్యలు


బిళ్లనందూరులో గ్రావెల్ కొండను పరిశీలిస్తున్న అధికారులు

కోటనందూరు: అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై టి.రామకృష్ణ హెచ్చరించారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో మండలంలోని బిళ్లనందూరులో గ్రావెల్ కొండను ఆర్ఐ గీతా, వీఆర్వో కాశీ శివలతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రావెల్ తవ్వకాలకు ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అన్నసమారాధన

కిర్లంపూడి: చిల్లంగి శ్రీనివాసనగరంలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శనివారం అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు చక్రవర్తుల రాఘవాచార్యులు(రఘు), ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 16 నుంచి వచ్చే నెల 13 వరకు స్వామి వారికి ప్రతిరోజూ విశేష పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తులు స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఎంపీ ప్రకటనపై రైతుల హర్షం

తొండంగి: మండలంలోని బెండపూడి, పీఈ చిన్నాయపాలెం ప్రాంతంలోని పచ్చని పంట పొలాల్లో ఎయిర్‌పోర్టు పెట్టబోమని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ చేసిన ప్రకటనపై ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని బెండపూడిలో శనివారం రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బెండపూడి, పి.ఈ.చిన్నాయపాలెం, అన్నవరం గ్రామాల రైతులు సమావేశమయ్యారు. రాజమండ్రి విమానాశ్రయంలో మూడు రోజుల క్రితం జరిగిన సమావేశంలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు సమక్షంలో ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై మాట్లాడినట్టు రైతు సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాయవరపు ఆనంద్ తెలిపారు. పొలాల్లో ఎయిర్‌పోర్టు పెట్టబోమని, ఖాళీగా ఉన్న పొలాల్లో ప్రతిపాదించేందుకు ప్రయత్నిస్తామని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గొంతెన నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి రాయవరపు ఆనంద్, సంయుక్త కార్యదర్శి దాసరి సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

మండల అధికారుల నంబర్లు

కిర్లంపూడి:

తహసీల్దార్	– 98499 03886
ఎంపీడీఓ	– 91009 70617
ఎంఈఓ	– 90009 12335
ఎంఈఓ–2	– 98487 43433
ఏపీఓ	– 83744 46309
ఏపీఎం	– 96523 04151
ఎస్సై	– 94409 04834
కిర్లంపూడి వైద్యాధికారి	– 77024 41029
వీరవరం వైద్యాధికారి	– 89193 43269
గెద్దనాపల్లి వైద్యాధికారి	– 81066 28018
మండల వ్యవసాయాధికారి	– 83310 56601
కిర్లంపూడి పశువైద్యాధికారి	– 89580 44698
భూపాలపట్నం పశువైద్యాధికారి	– 95429 08025
వీరవరం పశువైద్యాధికారి	– 89789 41840
హౌసింగ్ ఏఈ	– 70939 30461
ఇంజినీరింగ్ అధికారి	– 97014 77778

జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికుల భిక్షాటన


ప్రత్తిపాడులో భిక్షాటన చేస్తున్న జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులు

ప్రత్తిపాడు రూరల్: ఏలేశ్వరం మండలం చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికులు శనివారం ప్రత్తిపాడులో భిక్షాటన చేశారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రధాన రహదారి మీదుగా భిక్షాటన చేస్తూ వెళ్లి డిప్యూటీ తహసీల్దార్ కె.పుణ్యవతికి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్షుడు రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ చిన్నింపేటలోని జీడిపిక్కల ఫ్యాక్టరీపై ఆదారపడి 400 మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారన్నారు. ఫ్యాక్టరీని మూసివేయడంతో వీరంతా రోడ్డున పడ్డారన్నారు. తక్షణమే ఫ్యాక్టరీని తెరిచి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అనిశెట్టి వీరబాబు, చక్రధర్, గోవింద్, బ్రహ్మాజీ, ఆది, కాంతారావు, రామదుర్గ, జయలక్ష్మి, భాగ్యలక్ష్మి, చంటి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు


జగపతినగరంలో పొక్లెయిన్‌తో రోడ్డుపై పొరను తొలగిస్తున్న దృశ్యం

కిర్లంపూడి: మండలంలో అధ్వానంగా మారిన ప్రధాన రహదారులపై 'సాక్షి' 'రహదారిద్ర్యం..!', 'రోడ్లు గుంతల మయం,' 'రహదారిలో గండం' అనే శీర్షికలతో ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించారు. కిర్లంపూడి–ప్రత్తిపాడు రోడ్డు మరమ్మతుల పనులు ప్రారంభించారు. కిర్లంపూడి–ప్రత్తిపాడు రోడ్డుకు గోతులు పడిన చోట దహదారికి పూర్తిగా తొలగించి మళ్లీ వేచేందుకు చర్యలు తీసుకున్నారు. గత మూడు రోజులుగా రోడ్డు మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి. దీనిపై పెద్దాపురం ఆర్అండ్‌బీ ఇంజినీర్ వెంకటేశ్వరావును వివరణ కోరగా కిర్లంపూడి నుంచి ప్రత్తిపాడు వరకూ సుమారు 6 కిలోమీటర్ల మేర రోడ్డు మరమ్మతులకు రూ.32 లక్షలు మంజూరైనట్టు తెలిపారు. దీంతో పాటు రాజుపాలెం–రామవరం రోడ్డు పనులు కూడా ప్రారంభించామన్నారు. కాగా చిల్లంగి–వేలంక, జగపతినగరం అడ్డురోడ్డు–సింహాద్రిపురం గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆయా రహదారులకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సాక్షి ఇంపాక్ట్



రోడ్ల దుస్థితిపై 'సాక్షి'లో వచ్చిన కథనం

వృద్ధులు, వితంతులకు దుస్తుల పంపిణీ

శంఖవరం: స్థానిక క్రీస్తు ప్రార్థన మందిరంలో చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం వృద్ధులు, వితంతులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకులు మెండి రవికుమార్ మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా 45 మంది పేదలు, అనాథలకు విద్య, వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. ప్రతిరోజు 300 మంది రోగులకు అన్నదానం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ ఆర్థిక కార్యదర్శి చింతా నారాయణమూర్తి పాల్గొన్నారు.


శంఖవరంలో వృద్ధులకు దుస్తులు అందజేసిన చేయూత సంస్థ సభ్యులు

గుర్తు తెలియని మహిళ మృతి

కిర్లంపూడి: గుర్తు తెలియని మహిళ మృతిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.సతీష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల పరిధి బూరుగుపూడి జాతీయ రహదారిపై తెల్లవారు జామున 5 గంటలకు సుమారు 55–60 ఏళ్ల మధ్య వయసు గల గుర్తు తెలియని మహిళను జగ్గంపేట వైపు వెళుతున్న ఓ వాహనం బలంగా ఢీకొనడంతో రెండు కాళ్లూ విరిగిపోయాయి. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై వీఆర్వో–1 రాణాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. మృతురాలు ఛామనచాయ రంగు, నీలం రంగు కాటన్ చీర ధరించి ఉంది. మృతురాలి బంధువులు ఎవరైనా ఉంటే 94407 96529, 94409 04834 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఎస్సై అన్నారు.

జర్నలిస్టులపై దాడికి నిరసన

గండేపల్లి: విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై జరిగిన దాడిని ఖండిస్తూ గండేపల్లి, జగ్గంపేట మండలాల జర్నలిస్టుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం జగ్గంపేటలో ధర్నా నిర్వహించారు. వైఎస్సార్ కడప జిల్లా వేముల మండలంలో సాగు నీటి సంఘం ఎన్నికల కవరేజ్ కోసం వెళ్లిన 'సాక్షి' మీడియా ప్రతినిధులపై జరిగిన దాడిని వారు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతు ప్రజాస్వామ్యంలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులపై దాడులు చేయడం బాధాకరమన్నారు. ఇది పత్రికా స్వేచ్ఛను హరించడమే అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టులపై దాడులు పెరిగాయన్నారు. ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. తొలుత జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయం నుంచి ర్యాలీగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వినతిపత్రం అందజేశారు. అక్కడి నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ జేవీఆర్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి జిల్లాల కోశాధికారి వెలిది బాబులు, జగ్గంపేట నియోజవర్గం ప్రధాన కార్యదర్శి చింతల రాంబాబు, నియోజకవర్గ కోశాధికారి రాయుడు బాబ్జి, జగ్గంపేట, కిర్లంపూడి మండలాల అధ్యక్షులు చిక్కాల మణికంఠ, గండే నాని, గండేపల్లి మండలం ప్రధాన కార్యదర్శి నేదూరి శ్రీధర్, సభ్యులు అడబాల సుబ్బన్న, కొత్త సతీష్ తదితరులు పాల్గొన్నారు.


జగ్గంపేటలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

దాడిని ఖండించిన జర్నలిస్టులు

ప్రత్తిపాడు: కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం వేముల మండలంలో సాగునీటి సంఘం ఎన్నికల కవరేజ్‌కు వెళ్లిన 'సాక్షి' మీడియా ప్రతినిధులపై అక్కడి అధికార పార్టీ నేతలు చేసిన దాడిని ఖండిస్తూ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ కె.పుణ్యవతి, ప్రత్తిపాడు సీఐ బి.సూర్య అప్పారావులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ప్రగడ రామకృష్ణ మాట్లాడుతూ కడప జిల్లాలో సాగునీటి సంఘం ఎన్నికల కవరేజీకి వెళ్లిన మీడియా ప్రతినిధులపై దాడికి పాల్పడి గాయపర్చడం బాధకరమన్నారు. జర్నలిస్టులపై దాడులు చేస్తున్నవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు సోర్నపూడి సోమేశ్వరరావు, చిలకమర్తి సాయి ప్రసాద్, ఎలక్ట్రానిక్ మీడియా గౌరవ అధ్యక్షుడు ప్రత్తి శ్రీనివాసరావు, అధ్యక్ష, కార్యదర్శులు దాకారపు కృష్ణ, తుమ్మల సుబ్బు, గల్లా కృష్ణమోహన్, శివకుమార్ పాల్గొన్నారు.


ప్రత్తిపాడులో సీఐ సూర్య అప్పారావుకు వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

ఘనంగా దత్త జయంతి


ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయ స్వామి

అన్నవరం: దత్తజయంతిని పురస్కరించుకుని స్థానిక సుబ్బరాయపురంలోని గోడే వారి తోటలో వేంచేసిన దత్తాత్రేయస్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేశారు. అనంతరం స్వామివారికి వివిధ రకాల పత్రులు, పుష్పాలతో సహస్రనామ పూజలు చేసి నీరాజనమంత్ర పుష్పాలు సమర్పించారు. భక్తులతో సిద్ధ మంగళ స్తోత్ర పారాయణ చేయించి ప్రసాదాలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తుని రూరల్: మండలంలోని కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో గురుదత్త జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పాద పూజ నిర్వహించారు. వేద పండితులు, వేదవిద్యార్థులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ జాతర ఏర్పాట్లు పరిశీలన


మురారిలో అమ్మవారి జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీహరిరాజు

గండేపల్లి: మండలంలోని మురారి మామిడితోటల్లో వేంచేసిన కనకదుర్గ అమ్మవారి జాతర ఏర్పాట్లను పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు శనివారం పరిశీలించారు. ఈ నెల 17న అమ్మవారి జాతర నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం భారీ బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్టు డీఎస్పీ తెలిపారు. ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్సైలు, 45 మంది సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నట్టు వివరించారు. అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఉత్సవ కమిటీ సభ్యులకు సూచించారు. తాగునీరు, ఇతర సౌకర్యాలు కల్పించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు తావులేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట సీఐ వైఆర్కే శ్రీనివాస్, ఎస్సై యువి శివ నాగబాబు, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా అమ్మవారి జాతర

జగ్గంపేట: మండలంలోని జె.కొత్తూరు గ్రామ శివారులో వేంచేసిన కనకదుర్గమ్మ జాతర మహోత్సవం శనివారం రాత్రి కన్నులపండువగా జరిగింది. జాతరను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం అమ్మవారి తీర్థం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం

- ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు
- పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు


ఏలేశ్వరంలో నూతనకార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎంపీపీ, కౌన్సిలర్లు


ఎ.కొత్తపల్లిలో డైరెక్టర్ నరేష్‌కుమార్‌ను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం ఏకగ్రీవంగా జరిగాయి. ప్రతిపక్ష వైఎస్సార్ సీపీ సాగునీటి సంఘాల ఎన్నికలను బహిష్కరించడంతో అధికార పార్టీకి చెందిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని వైఆర్‌పీ–2 పరిధిలో ఎన్నికలకు గాను 6 నామినేషన్లు దాఖలు కావడంతో ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. అధ్యక్షుడిగా సామంతుల కృష్ణకిషోర్, ఉపాధ్యక్షుడిగా చిలకమర్తి మునీశ్వరరావు, డైరెక్టర్లు గట్టెం సీతారామ్, వాగు కామేశ్వరరావు, బుద్దా సూర్యప్రకాష్, గంగిరెడ్ల జగదీశ్వరరావు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా కూడుపూడి వెంకటేశ్వర్లు వ్యవహరించారు. వీరికి ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు.

రౌతులపూడి: మండలంలోని 14 నీటి సంఘాలకు శనివారం జరిగిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఆ పార్టీ శ్రేణులు ఈ ఎన్నికలను బహిష్కరించారు. మండలంలోని రౌతులపూడిలో–4, ఎం.చామవరంలో–2, పి.చామవరం, కోడూరు, గిడజాం, బీబీ పట్నం, ఎ.మల్లవరం, బలరామపురం, ములగపూడి, ఎస్ఎస్ పట్నంలో సాగునీటి చెరువులకు ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అధికార కూటమి పార్టీకి చెందిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు వెల్లడించారు.

కిర్లంపూడి: మండలంలోని 13 పోలింగ్ బూత్‌ల్లో శనివారం నిర్వహించిన నీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో 103 మంది టీసీలు, 13 డబ్ల్యూఏలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు తహసీల్దార్ జె.చిరంజీవి తెలిపారు. పోలింగ్‌బూత్‌ల వద్ద ఎటువంటి ఘర్షణలకు తావులేకుండా జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, స్థానిక ఎస్సై జి.సతీష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

గండేపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సాగు నీటి సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో ఏడు మేజర్ చెరువులు, 13 మైనర్ చెరువులకు నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షులు, ఉపాధ్యాక్షులు, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. జగ్గంపేట మండలంలో ఏడు మేజర్, 9 మైనర్ చెరువులకు జరిగిన ఎన్నికలు ఏకగ్రీవమైనట్టు జగ్గంపేట తహసీల్దార్ జేవీఆర్ రమేష్ తెలిపారు.

తొండంగి మండలంలో 16 నీటి సంఘాలకు...

తొండంగి: మండలంలో 16 సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని తహసీల్దార్ మురార్జీ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు క్షేత్రస్థాయిలో 45 టీమ్‌ల సిబ్బంది పనిచేశారన్నారు. అన్ని సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవం కావడంతో ఎన్నిక ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జగదీష్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజారావు, వీఆర్వోలు, పీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

ఎ.కొత్తపల్లి సాగునీటి సంఘం డైరెక్టర్‌గా జగనన్న వలంటీర్ నరేష్‌కుమార్

మండలంలో పంపా ఆయకట్టు పరిధిలో ఎ.కొత్తపల్లి సాగునీటి సంఘం డైరెక్టర్‌గా అదే గ్రామానికి చెందిన జగనన్న వలంటీర్ వనపర్తి నరేష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పంపా ఆయకట్టు పరిధిలోని గోపాలపట్నం, ఎ.కొత్తపల్లి, శృంగవృక్షం, తొండంగి–1, తొండంగి–2, కృష్ణాపురం సంఘాలకు శనివారం రెవెన్యూ అధికారులు ఎన్నికలు నిర్వహించారు. ఎ.కొత్తపల్లి సంఘానికి డైరెక్టర్‌గా ఎన్నికైన నరేష్‌కుమార్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు బెక్కం చంద్రగిరి, సాపిశెట్టి చిన్న, సోము లచ్చారావు, గ్రామ ఉపసర్పంచ్ శివకోటి గన్నియ్య, మాధన నాగేశ్వరరావు, మాధన సత్యనారాయణ తదితరులు పూలమలలు వేసి ఘనంగా సన్మానించారు.

కోటనందూరు: మండలంలో నీటి సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. మైనర్ ఇరిగేషన్ పరిధిలో 10 నీటి సంఘాలకు, మేజర్ ఇరిగేషన్ పరిధిలో 10 సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. ఈ 20 సంఘాల పరిధిలో 26,130 మంది రైతులు ఉండగా సంఘ అధ్యక్షులందరినీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల ప్రక్రియను తహసీల్దార్ టి.సుభాష్, ఇరిగేషన్ ఏఈలు దుర్గబాబు, వరుణ్, డీటీ పీవీవీ సత్యనారాయణ, ఆర్ఐ కే గీత, వర్క్ ఇనస్పెక్టర్ నాగబాబు పర్యవేక్షించారు.

శంఖవరం: మండలవ్యాప్తంగా శనివారం జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. శంఖవరం, కొంతంగి, కత్తిపూడి, అన్నవరం, కొంతంగి కొత్తూరు గ్రామాల్లో సాగు నీటి సంఘాలకు ఒక్కొక్క నామినేషన్ మాత్రమే రావడంతో అధికారులు వారిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. శంఖవరం పెద బాపన్న దొర చెరువుకు అధ్యక్షుడిగా బైరా రాంబాబు, కొంతంగి కన్నమ్మ చెరువు అధ్యక్షుడిగా బద్ది లోవరాజు, కొంతంగి కొత్తూరు బాలరాజు చెరువుకు అధ్యక్షుడిగా గొల్లవిల్లి గోవింద్, అన్నవరం రిజర్వాయర్ చెరువుకు అధ్యక్షుడిగా దొడ్డి జలగనిక, కత్తిపూడి వెంకన్నదొర చెరువుకు అధ్యక్షుడిగా పీతల పెంటయ్య ఎన్నికైనట్లు తహసీల్దార్ పోతురాజు, ఇరిగేషన్ ఏఈ సందీప్ తెలిపారు.


ముక్కొల్లు పోలింగ్ బూత్ వద్ద నేతలతో మాట్లాడుతున్న పోలీసులు

తుని మండలంలో 14 నీటి సంఘాలకు...

తుని రూరల్: మండలంలో 14 నీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమైనట్టు తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. ఈ నెల 11న ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయగా శనివారం ఎన్నికలు నిర్వహించారు. 12 మైనర్ నీటి వినియోగదారుల సంఘాలు, తాండవ, పుష్కర కాలువల డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. 91 టీసీ సభ్యులు ఎన్నికోగా అందులో 14 మంది చైర్మన్లు, 14 మంది వైస్ చైర్మన్లు ఎన్నికున్నట్టు వివరించారు.

ప్రత్తిపాడు రూరల్: మండల వ్యాప్తంగా సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 138 టీసీలకు సంబంధించి 135 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 17 నీటి సంఘాలకు అధ్యక్షులను, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. లంపకలోవ సాగు నీటి సంఘానికి ఎన్నికైన ప్రతినిధులను స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అభినందించారు. తహసీల్దార్ సూర్యప్రభ, ఇరిగేషన్ ఏఈఈ ఇబ్రహీం, డిప్యూటీ తహసీల్దార్ కె.పుణ్యవతి, ఆర్ఐ గోపాలకృష్ణ తదితరులు ఎన్నికలను పర్యవేక్షించారు.